క్లుప్తంగా

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

మర్రిపాలెం: ఈ నెల 30వ తేదీ గురువారం కూడా ఏపీఈపీడీసీఎల్ జోన్–2 పరిధిలో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కౌంటర్లు తెరిచే ఉంటాయని ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సెలవు లేదని, ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ మాధవధార వుడా కాలనీ, కంచరపాలెంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్‌ఏవీ కలెక్షన్ సెంటర్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వినియోగదారులు గమనించి బిల్లులు చెల్లించాలని ఆయన కోరారు.

శివాలయ హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న శ్రీహరి సేవకులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. దేవదాయ శాఖ సూపర్‌వైజర్(ఈవో) కె.పద్మావతి పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వహణాధికారి పైలా శేఖర్‌బాబు ఆధ్వర్యంలో అర్చకులు, శ్రీహరి సేవకులు, ట్రస్టీ సభ్యులు, సిబ్బంది ఆదాయం లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో శేఖర్‌బాబు మాట్లాడుతూ 90 రోజులకు గానూ భక్తుల దక్షిణ రూపంలో రూ.1,90,200 ఆదాయం వచ్చిందని తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థికి సామగ్రి అందిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ కపుల్స్ ప్రతినిధులు

సీతంపేట: రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ కపుల్స్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 90 మంది విద్యార్థులకు బుధవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. రైటింగ్ ప్యాడ్స్, పెన్స్, పెన్సిల్స్, స్కేల్, జామెట్రీ బాక్సులు, ఎరైజర్స్ అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు సుభోద్‌కుమార్, కమ్యూనిటీ సర్వీసెస్ ప్రతినిధి వి.శ్రీనివాస్, కోశాధికారి కృష్ణారావు, హెచ్‌ఎం బి.లక్ష్మీనరస, ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, మాణిక్యం పాల్గొన్నారు.

లలితా పీఠంలో వారాహి హోమం



వారాహి హోమం నిర్వహిస్తున్న పండితులు

సీతంపేట: వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అష్టమి సందర్భంగా బుధవారం రాత్రి లలితానగర్ లలితా పీఠంలో వేదపండితులు శాస్త్రోక్తంగా వారాహి హోమం నిర్వహించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ శతృనాశనం, కష్టాల నుంచి బయటపడటం, భూసంబంధిత వ్యవహారాల పరిష్కారం, పంటలు కాపాడటం, ప్రయోగ బాధలు, ఆరోగ్య, మానసిక సమస్యల నుంచి విముక్తి పొందడానికి వారాహి హోమం నిర్వహిస్తారని తెలిపారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

సీతంపేట/సీతమ్మధార: టీడీపీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని పార్టీ కార్యాలయం వద్ద వార్డు మాజీ కార్పొరేటర్ ముక్కా ముత్యాలనాయుడు పార్టీ జెండా ఎగరేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్, కార్యదర్శి పి.లక్ష్మణ, మహిళలు పాల్గొన్నారు.

- 24వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షురాలు బర్ల పద్మాలత ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పార్టీ నాయకులు, శ్రేణులకు పంచిపెట్టారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి

- నేడు శ్రీరామ నవమి పర్వదినం
- వేడుకలకు ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి



లలితా పీఠంలో కల్యాణానికి ఏర్పాట్లు



సీతంపేటలో కల్యాణం కోసం సిద్ధం చేసిన వేదిక

సీతంపేట: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఉత్తర నియోజకవర్గంలో వాడవాడలా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాలు, గ్రామ సంఘాలు, భక్తులు సీతారాముల కల్యాణ మహోత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.

సీతంపేటలో భారీగా ఏర్పాట్లు...

జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణానికి భారీ ఏర్పాట్లు చేపట్టారు. సీతంపేటలోని పార్వతీశ్వరాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గురువారం ఉదయం 9 గంటలకు కల్యాణం ప్రారంభించనున్నారు. సాయంత్రం 6 గంటలకు సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు సీతారాముల పట్టాభిషేకం వైభవంగా జరుగుతుందని చెప్పారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పార్వతీశ్వరాలయం వద్ద మహా అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులకు కోరారు.

పట్టువస్త్రాలు, ఆభరణాలతో ముస్తాబు

ఇంట్లో ఆడపిల్ల పెళ్లి ఎంత ఘనంగా నిర్వహిస్తారో దాని కంటే వైభవంగా రాములోరి కల్యాణం జరపడానికి భారీ ఏర్పాట్లు చేశారు. సీతారాముల పంచలోహ విగ్రహాలను పట్టువస్త్రాలు, ఆభరణాలతో ముస్తాబు చేశారు. వివాహ ఘట్టం కోసం పూలతో అలంకరించిన చూడముచ్చటైన వేదిక, మేళతాళాలు, పూజా సామగ్రిని సిద్ధం చేశారు. సుమూహుర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు శాస్త్రోక్తంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకుడు సంపంగి శ్రీనివాసరావు తెలిపారు. 200 మంది మహిళలతో సారె ఊరేగింపు, కోలాటం, అన్నమయ్య వేషధారణలో చిన్నారులు ఊరేగింపులో పాల్గొంటారని చెప్పారు.



ముస్తాబైన సీతారాములు

లలితా పీఠంలో..

లలితానగర్ లలితా పీఠం దర్బారు హాల్లో గురువారం ఉదయం 9 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందని పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కల్యాణాన్ని వీక్షించి తరించాలని కోరారు.

- అక్కయ్యపాలెం గోకులపాలెంలోని రామాలయంలో కల్యాణానికి ఏర్పాట్లు చేశారు.

మురళీనగర్, కప్పరాడ ఆలయాల్లో..

మురళీనగర్: మురళీనగర్ రామాలయం, కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేశారు. రామాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేస్తారు. 8 గంటలకు నీరాటోత్సవం అనంతరం సీతారాములను పెండ్లికుమార్తె, కుమారుడిగా అలంకరిస్తారు. 9 గంటల నుంచి కల్యాణోత్సం ప్రారంభమవుతుంది. సాయంత్రం శ్రీరాముడి పట్టాభిషేకం, దర్బార్ సేవ, పవళింపు సేవ చేస్తారు. వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు కల్యాణం నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. పట్టాభిరెడ్డితోట దాసాంజనేయ స్వామి ఆలయ సమీపంలో భారీ వేదిక పైకి సీతారాములను తోడ్కొని వచ్చి సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు.

మహిళల ఆర్థిక ప్రగతే సీఎం ధ్యేయం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కె.కె.రాజు, మహిళలు

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి 'ఆసరా' లబ్ధిదారుల క్షీరాభిషేకం

కంచరపాలెం: మహిళల సంక్షేమం, స్వావలంబన, సాధికారత, ఆర్థిక ప్రగతే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు బాసటగా వరుసగా మూడో ఏడాది వైఎస్సార్ ఆసరా పథకం నిధులు ప్రభుత్వం విడుదల చేసిన సందర్భంగా బుధవారం 46వ వార్డు తాటిచెట్లపాలెం పరిధి శాంతినగర్ సచివాలయం వద్ద జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ నేతృత్వంలో కృతజ్ఞతా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి లబ్ధిదార మహిళలతో కలిసి కె.కె.రాజు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అక్కచెల్లెమ్మను లక్షాధికారిని చేసే దిశగా సీఎం జగన్ ఆసరా పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారన్నారు. అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు మహిళలకు మేలు చేసే ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. అనంతరం అక్కడి రామాలయం నుంచి తాటిచెట్లపాలెం జంక్షన్ వరకు వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, ఆయా వార్డుల కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, ఉష, కంటిపాము కామేశ్వరి, చల్లా రజని, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, పార్టీ వార్డు అధ్యక్షుడు నీలి రవి, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, డైరెక్టర్లు రవికుమార్, ప్రసాద్, సీనియర్ నాయకులు, అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన



కప్పరాడ హైస్కూల్‌లో సమస్యలు పరిశీలిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ రజని

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ చల్లా రజనితో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఐటీఐ కూడలి కప్పరాడలో పర్యటించారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా కప్పరాడ జీవీఎంసీ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించి హెచ్‌ఎం విజయమాలినితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ప్రజాసంకల్ప యాత్ర ద్వారా ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకుని విద్య, వైద్యం, ఉపాధి ప్రతి పేదోడికి అందేలా పరిపాలన కొనసాగిస్తున్నారని కొనియాడారు.

కుళాయి నీటిలో పురుగులు



సంఘం ఆఫీస్ ప్రాంతంలో కుళాయి నీటిలో ఉన్న పురుగులు

సీతంపేట: జీవీఎంసీ కుళాయిల ద్వారా సరఫరా చేసే తాగునీటిలో పురుగులు రావడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కయ్యపాలెం జగన్నాథపురంలోని సంఘం ఆఫీస్, శ్మశానవాటిక ప్రాంతాల్లో వారం రోజులుగా మురుగు నీరు కుళాయిల్లో వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్లకు మరమ్మతులు చేశామని సిబ్బంది చెబుతున్నా.. బుధవారం కూడా కుళాయి నీటిలో పొడవైన పురుగులు రావడంతో ఈ నీటిని తాగేదెలా అని స్థానిక మహిళలు అసహనం వ్యక్తం చేశారు. మురుగు నీరు, పురుగులతో నీటిని సరఫరా చేసే అనారోగ్యం పాలు కామా అని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన



సీతమ్మధార రైతుబజార్‌లో అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

సీతమ్మధార: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా డీఎల్‌ఏటీ ఆఫీసర్ డాక్టర్ పూర్ణచంద్రబాబుల ఆదేశాల మేరకు భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సీతమ్మధార రైతుబజార్‌లో క్షయ వ్యాధిపై అవగాహవాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టీఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ టీబీ రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు తుంపరల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. రెండు వారాలకు పైగా పొడి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. పౌష్టికాహారం కోసం ప్రభుత్వం నెలకు రూ.500 చొప్పున ఆరు నెలలు పాటు అందిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు, రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం రైతుబజార్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం.సునీత, ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించండి



ఆర్పీ పేట ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: సాధారణ ప్రసవాలపై మహిళలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. కంచరపాలెం ఆర్పీ పేట డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు. వైద్యులు, పారా మెడికల్ సిబ్బందితో మాట్లాడారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, శస్త్ర చికిత్సలు చేసే ప్రసవాలను తగ్గించాలని చెప్పారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వైద్యుల సలహా మేరకు వారికి ఐరన్ పోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. బయోమెట్రిక్ హాజరుతో పాటు ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్(ఎఫ్‌ఆర్‌ఎస్) హాజరు వేయాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది అంతా డ్రెస్‌కోడ్ పాటించాలని పేర్కొన్నారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు శ్రీనివాసనగర్‌లో నివసించే పైలా పైడమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయంగా మృతురాలి కుటుంబానికి బుధవారం రూ.10 వేలను కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు, స్థానిక నాయకులు పోతిబంతి హరికృష్ణ, సారిపిల్లి గంగరాజు, పువ్వాడ గోవిందమ్మ, ఉప్పాడ సన్నీ, గుడివాడ గౌరినాయుడు, వార్డు వెల్ఫేర్ సెక్రటరీ మణి, వలంటీర్ తనూజ పాల్గొన్నారు.

జానకీలాల్ సేవలు శ్లాఘనీయం



జానకీలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శుభ, ఇతర ప్రతినిధులు

మురళీనగర్: వాకర్స్ ఇంటర్నేషనల్ రెండో అధ్యక్షుడు జానకీలాల్ తోష్నీవాల్ వాకర్స్ ఉద్యమానికి చేసిన సేవలు శ్లాఘనీయమని వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. జానకీలాల్ సంస్మరణ దినోత్సవాన్ని ఆమె ఆధ్వర్యంలో బుధవారం మురళీనగర్ వాకర్స్ పార్కులో నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ నడిచి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలనే జానకీలాల్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్దామని శుభ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషన్ అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి ఎల్.వి.సుధాకర్, పూర్వ అధక్షుడు ఎస్.బుచ్చయ్య, వనిత వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రభాశర్మ, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రమీల, ఉషోదయ వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.మాధురి, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు శేషామణి, మహిళా వాకర్స్ క్లబ్ క్యాబినెట్ పీఆర్‌వో కె.మాధవి, వాకర్ ఇంటర్నేషనల్ సెక్రటరీ కె ద్వారకానాథ్, క్యాబినెట్ సెక్రటరీ సీహెచ్ జ్యోతి, క్యాబినెట్ ఎడిటర్ పద్మావతి, కో ఆర్డిటర్ స్నేహలత, జాయింట్ సెక్రటరీ జయ పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు మరిన్ని సదుపాయాలు



కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో పర్యటిస్తున్న పాసింజర్ ఎమినిటీస్ కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే బోర్డుకు చెందిన ప్రయాణికుల సదుపాయాల కమిటీ(పాసింజర్ ఎమినిటీస్ కమిటీ) సభ్యులు బుధవారం కూడా వాల్తేర్ డివిజన్‌లో పర్యటించారు.

కొత్తవలస–కోరాపుట్ లైన్‌లోని దమన్‌జోడి, కోరాపుట్ రైల్వే స్టేషన్లలో సభ్యులు దిలీప్‌కుమార్ మల్లిక్, అభిజిత్‌దాస్, నిర్మలకిషోర్ బొల్లిన, గొట్టాల ఉమారాణి, డాక్టర్ జి.వి.మంజుల, పరశురాం మహతో తనిఖీలు చేపట్టారు. ఆయా స్టేషన్లలో ప్రయాణికుల కనీస సదుపాయాలైన తాగునీరు, వెయింటింగ్ హాల్స్, మరుగుదొడ్లు, ప్లాట్‌ఫాం పైకప్పులు, పాదచారుల వంతెనలు, కూర్చునే సదుపాయాలు, కేటరింగ్ స్టాల్స్ వంటి వాటితోపాటు పరిశుభ్రత, కేటరింగ్ స్టాల్స్ వద్ద ఆహార నాణ్యతలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా వెయిటింగ్ హాల్స్, ప్లాట్‌ఫారాలపై గల ప్రయాణికులతో కమిటీ సభ్యులు మాట్లాడి, వారి సూచనలు తీసుకున్నారు. ఈ

స్టేషన్లలో అమృత్ భారత్ పథకం కింద మరిన్ని సదుపాయాలను సమకూర్చనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పర్యటనలో డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అవినాష్ శర్మ, ఎలక్ట్రికల్, సిగ్నల్, టెలికం, సివిల్ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా యువత



ప్రసంగిస్తున్న డిప్యూటీ కలెక్టర్ మాధవి

ఏయూ క్యాంపస్: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని డిప్యూటీ కలెక్టర్ జె.మాధవి అన్నారు. బుధవారం ఏయూ ఫార్మసీ కళాశాల సమావేశ మందిరంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువతరం ఆరోగ్య జీవనం అలవరచుకోవాలని సూచించారు. ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ 'సే నో టు డ్రగ్స్'అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. యువత పెడతోవ పట్టకుండా వారిలో మంచి ఆలోచనలు పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ 14500 ఏర్పాటు చేసి యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచే ప్రయత్నం చేస్తోందన్నారు. ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ చైర్మన్ ఉమారాజ్, ప్రభుత్వ మానసిక వైద్యశాల వైద్యులు డాక్టర్ కె.ప్రభాత్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ ఎల్.మాధవి, ఎక్సైజ్ విభాగం ఎస్ఐ జి.రాజేశ్వరి, ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.శైలజ పాల్గొన్నారు.

నేత్ర వైద్యశాలకు కంప్యూటర్, స్కానర్ వితరణ



డాక్టర్ విశ్వామిత్రకు కంప్యూటర్ అందజేస్తున్న వైద్యులు మూర్తి, తారకేశ్వరరావు

సీతంపేట: గాయత్రి విద్యా పరిషత్ ఆస్పత్రి యాజమాన్యం రామటాకీస్ సమీపంలోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు బుధవారం అడ్వాన్డ్స్ కంప్యూటర్, ప్రింటర్, స్కానర్‌ను వితరణ చేశారు. ఆప్తమాలజీ విభాగం ప్రొఫెసర్, విభాగాధిపతులు డాక్టర్ యు.ఎస్.ఎన్.మూర్తి, డాక్టర్ ఎ.తారకేశ్వరరావు చేతుల మీదుగా నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి.విశ్వామిత్రకు అందించారు. కార్యక్రమంలో డీబీసీఎస్ ఆప్తాలమిక్ ఆఫీసర్లు ఎం.ఉమాశ్రీనివాస్, ఆర్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వృక్షశాస్త్ర విభాగం సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విభాగంలో ఉన్న వివిధ మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు స్వయంగా అభివృద్ధి చేస్తున్న పలు మొక్కలతో కూడిన నర్సరీని పరిశీలించారు. విద్యార్థులను అడిగి మొక్కల వివరాలు, ప్రత్యేకతలు, వాటిని పెంచే విధానం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే విధంగా కృషి చేయాలని సూచించారు. వర్సిటీలో నూతనంగా నిర్మించే పలు భవనాల వద్ద సుందీకరణ, మొక్కలు నాటే కార్యక్రమంలో విలువైన సూచనలు వృక్షశాస్త్ర విభాగం అందించాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య పి.రత్నకుమార్, డాక్టర్ ఉజ్వల్ కుమార్ పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

అధ్వాన రోడ్డును బాగు చేయండి



గోతులమయమైన కళింగనగర్ రహదారి

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలోని కళింగ నగర్ రహదారి అధ్వానంగా ఉంది. యూజీడీ పైప్‌లైన్ల కోసం తవ్విన రోడ్డును సరిగ్గా పూడ్చకుండా వదిలేశారు. స్థానికులతోపాటు అటుగా వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. రోడ్డు మధ్యలో గోతులు తవ్వేయడం వల్ల యూజీడీ మ్యాన్‌హోల్స్ బయటకు వచ్చేశాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలి.

– కె.సన్యాసిరావు, కళింగనగర్